క్లుప్తంగా

పూర్తయిన వంతెన పరిశీలన

దహెగాం: మండలంలోని దిగిడ, కమ్మర్‌గాం పెద్దవాగుపై రూ.17 కోట్ల ఎల్‌డబ్ల్యూఈ నిధులతో నిర్మించిన వంతెన నిర్మాణం పూర్తి కాగా శనివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన నిర్మాణం పూర్తి కావడంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ బొర్కడే, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని హడ్కోకాలనీలో నెలకొన్న నీటి సమస్య, డ్రెయినేజీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని శనివారం ఎంఎం హెల్ప్‌లైన్ పౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

'విద్యుత్ శాఖ అధికారిని బదిలీ చేయాలి'

తిర్యాణి: మండల విద్యుత్ శాఖ ఏఈగా విధులు నిర్వహిస్తున్న కవితను బదిలీ చేయాలని తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు వెడమ భగవంత్‌రావు మాట్లాడుతూ మండలంలో చిన్నపాటి గాలివానలకే విద్యుత్ సరఫరాలో గంటల తరబడి అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు గోపాల్, సుభాష్, భాస్కర్, హనుమంత్‌రావు, బారిక్‌రావ్, గణపతి, మోతుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో వైద్యశిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి అజ్మీర రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అవసరమైన వారికి మందులు అందించారు. వైద్యాధికారి అజ్మీర రాజ్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. వైద్య శిబిరాన్ని ఎంపీవో సుధాకర్ రెడ్డి తనిఖీ చేసి పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిరా, ఏఎన్‌ఎంలు తార్సినా, రోసియా, ఆశ వర్కర్లు రజిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

సిర్పూర్(టి): మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను గుర్తించి పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఊట్ల సుధాకర్ ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి శనివారం బాధితుడికి ఎస్సై రమేశ్ అందజేశారు.

బీఎస్పీ కార్యదర్శిగా అర్షద్

బెజ్జూర్: బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శిగా నియమితులైన అర్షద్ హుస్సేన్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో శనివారం పార్టీ నాయకులు సన్మానించారు. పార్టీ బలోపేతం కోసం అర్షద్ హుస్సేన్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదగడం మంచి విషయమన్నారు. నాయకులు సల్మాన్‌ఖాన్, అరుణ్, పోశం, కిరణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: చేప పిల్లల సంరక్షణలో తగు జాగ్రత్తలు పాటిస్తే చేపలు బరువు పెరుగుతాయని జల్ జీవిక ప్రతినిధి పద్మాకర్ అన్నారు. శనివారం మండలంలోని అడ గ్రామంలో మత్స్యకారులకు జల్ జీవిక సంస్థ, పూణే, ఎస్‌వీపీ (సోషల్ వెంచర్ పార్ట్నర్), ఇండియా సంస్థల ఆధ్వర్యంలో చేప పిల్లల పెంపకం, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చేప పిల్లలకు రీ సర్క్యులేటింగ్ ఆక్వా కల్చర్ సిస్టమ్, మేతల యాజమాన్యం, వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది సతీష్, కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, మత్స్యకారులు పాల్గొన్నారు.

'గుండి'వాసుల గోస..!

- 2006లో వాగుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన
- పిల్లర్ దశలో నిలిచిన పనులు
- మార్చిలో తిరిగి ప్రారంభం.. నత్తనడకన పనులు
- త్వరగా పూర్తి చేయాలని వేడుకోలు



అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి వాగుపై వంతెన లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో వాగు ఉప్పొంగినప్పుడల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటుతున్నారు. వంతెన నిర్మాణం కోసం 2006లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్, పిల్లర్ దశ వరకు పూర్తి చేసి నిలిపివేశారు. ఈ మార్చిలో పనులు ప్రారంభించినా పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో వచ్చే వానాకాలంలో కూడా ఇబ్బందులు తప్పే పరిస్థితులు లేవు.

పడరాని పాట్లు..

జిల్లా కేంద్రానికి 3 కిలోమీటర్ల దూరంలో గుండి గ్రామం ఉంది. కాని గ్రామ సమీపంలోని వాగుపై వంతెన లేకపోవడంతో వాగు ఉప్పొంగినప్పుడల్లా 30 కిలోమీటర్లు దూరం తిరిగి రావాల్సిన పరిస్థితి వారిది. గుండి గ్రామానికి వెళ్లే వాగుపై వంతెన నిర్మాణం పూర్తికాక గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామానికి కనీసం 108 కూడా రాని పరిస్థితి ఉంది. వానాకాలంలో ఎరువులు, విత్తనాలు, ఇతర పనులకు రైతులు తప్పనిసరిగా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే. పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాని వంతెన లేకపోవడంతో వీరు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల 60లక్షలు మంజూరు చేసింది. శంకుస్థాపన చేసి పనులు కూడా ప్రారంభించారు. కాని పిల్లర్ దశ వరకు పనులు చేసి వదిలేశారు. గత మార్చిలో వంతెన నిర్మాణ పనుల కోసం రీటెండరింగ్ వేయగా, రూ.3.25కోట్లతో టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. కాని పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో గుండి గ్రామస్తుల గోస తీరేదెన్నడో అర్థం కాని పరిస్థితి ఉంది.

వంతెనలు లేక అనేక గ్రామాలు..

మండలంలోని అప్పపల్లి, అంకుసాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో వంతెనలు లేక గ్రామస్తులు వర్షాకాలంలోనే అష్టకష్టాలు పడుతున్నారు. అప్పపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగుకు ప్రస్తుతం పైపులు వేసి తాత్కాలికంగా రాకపోకలు సాగిస్తున్నారు. వానాకాలంలో భారీ వర్షం కురిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. అంకుసాపూర్ గ్రామం వద్ద ఉన్న వాగు వంతెన ఎత్తు తక్కువగా ఉండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై నుంచి వాగు ఉప్పొంగితే 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

అధికారులు దృష్టి సారించాలి



మా ఊరికి వెళ్లాలంటే వాగుపై వంతెన లేక వానాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వంతెన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నిర్మాణ పనుల్లో వేగం పెంచి పనులు పూర్తిచేసి గుండి గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

- రవీందర్, గుండి

వంతెన నిర్మించాలి



వానాకాలంలో మా గ్రామానికి రావాలంటే చాలా కష్టమవుతుంది. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వానాకాలంలోగా అప్పపల్లి వాగుపై వంతెన నిర్మించాలి. మా సమస్యను పరిష్కరించాలి.

- సాంబయ్య, అప్పపల్లి

ఆదర్శం.. చౌపన్‌గూడ జీపీ



చౌపన్‌గూడ గ్రామ పంచాయతీ భవనం

- ఆహ్లాదకర వాతావరణంలో పంచాయతీ కేంద్రం
- ఆకర్షణీయంగా ప్రకృతి వనం
- పకడ్బందీగా పారిశుధ్య పనులు



ప్రకృతి వనంలో వాకింగ్ ట్రాక్

వాంకిడి: అభివృద్ధిలో మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామపంచాయతీ చౌపన్‌గూడ ఆదర్శంగా నిలుస్తోంది. మండల కేంద్రం నుంచి సుమారు 10 కి.మీల దూరంలో అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న చౌపన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలో 5 అనుబంధ గ్రామాలున్నాయి. ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న నిధులతో పాటు గ్రామస్తుల సహకారంతో పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రతీ గ్రామానికి సీసీరోడ్లు నిర్మాణం చేపట్టడంతో పాటు గ్రామ పంచాయతీ పరిధిలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనానికి ప్రాధాన్యత కల్పించారు. ప్రతీరోజు జీపీ ట్రాక్టర్‌తో చెత్త సేకరణ, మొక్కలకు నీళ్లు పట్టడం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.

పచ్చదనం నడుమ..

ఐదు అనుబంధ గ్రామాలకు అందుబాటులో ఉండేలా నిర్మించిన చౌపన్‌గూడ జీపీ కార్యాలయం పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణంలో ఆకర్షణీయంగా ఉంది. 30 గుంటల స్థలంలో జీపీ భవనం, ఆట స్థలం, పల్లె ప్రకృతి వనం, భీమన్న దేవుని ఆలయం నిర్మించారు. అదే ఆవరణలో హరిత హారంలో మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేసిన నర్సరీలో 100శాతం మొక్కలు పెరిగేలా చర్యలు తీసుకున్నారు. జీపీ భవనానికి ఆనుకొని ఏర్పాటు చేసిన ప్రకృతి వనంలో జైనూర్, ఉట్నూర్ నుంచి తీసుకొచ్చిన చెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పార్కులో పాదచారులకు ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా జీపీ పరిధిలో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలను ప్రత్యేక శ్రద్ధతో సంరక్షించుకోవడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి రహదారుల గుండా వెళ్లే వారికి ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. సర్పంచ్ సీడం అన్నిగా కృషి, ప్రత్యేక చొరవతో జీపీ అభివృద్ధి దిశగా కొనసాగుతుందని పలువురు అభినందిస్తున్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి



గ్రామ ప్రజల సహకారంతోనే అభివృద్ధి పనులు చేపట్టాం. మా గ్రామపంచాయతీకి ఒక అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ఉపఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయాలి. చిన్నపాటి అనారోగ్యానికి గురైనా మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

- సీడం అన్నిగా, సర్పంచ్, చౌపన్‌గూడ

రాజీమార్గమే రాజమార్గం



కేసులు పరిష్కరిస్తున్న మెజిస్ట్రేట్ రవి

సిర్పూర్(టి): రాజీ మార్గమే రాజ మార్గమని జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు సిర్పూర్(టి)లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కక్షిదారులు క్షణికావేశాలకు లోనై పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం జూనియర్ సివిల్ కోర్టు సిర్పూర్(టి) పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, చింతమానెపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ రూరల్, ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 410 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో కౌటాల సీఐ సాదిక్ పాష, ఎస్సై రమేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ అన్నిగా

వాంకిడి: మండలంలోని చౌపన్‌గూడ పంచాయతీ పరిధిలో గల సడక్ గూడలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ టవర్ నిర్మాణానికి సర్పంచ్ సీడం అన్నిగా శనివారం భూమిపూజ చేశారు. మారుమూల గ్రామమైన చౌపన్‌గూడలో టవర్ ఏర్పాటు చేయడంతో సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జుగాధిరావు, కారోబారి సీడం కట్టి, ప్రతినిధులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



కేతిని గ్రామంలో ధ్వంసమైన రేకులు

చింతలమానెపల్లి: మండలంలోని కేతిని గ్రామంలో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా భారీగాలులతో కూడిన వర్షం కురిసింది. గ్రామంలోని ఎనుక లస్మయ్య, పోర్తెట్టి గంగారాం, ఆత్రం జలపతి, పోర్తెట్టి హన్మంతులకు చెందిన ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. మండలంలోని ఖర్జెల్లి నుంచి గూడెం వరకు పలుచోట్ల వృక్షాలు నేలకూలి రాకపోకలకు ఆటంకం కలిగింది.

వర్షం.. రైతు హర్షం

కౌటాల: మండలంలో శనివారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండలు, వడగాల్పులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే భారీ వర్షాలు కురిస్తేనే రైతులు విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఈదురు గాలులకు తెగిపడిన విద్యుత్ తీగ

రెబ్బెన: మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌లో శుక్రవారం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులకు విద్యుత్ వైరు ఇంటి ఆవరణలో తెగిపడింది. బలమైన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభంపై ఒక్కసారిగా మంటలు చెలరేగి వైరు తెగి సాలిగామ సంతోష్ ఇంటి ఆవరణలో పడింది. వెంటనే స్పందించిన విద్యుత్ సిబ్బంది తెగిపడిన తీగను సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఆడెపల్లిలో సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న బృందం

చింతలమానెపల్లి: మండలంలోని అడెపల్లి గ్రామ ఉపాధిహామీ పనులపై ఆడిట్ బృందం తనిఖీ నిర్వహించింది. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధికూలీలతో సమావేశం నిర్వహించారు. 1.12.2020 నుంచి 21.03.2023 వరకు నిర్వహించిన ఉపాధి పనులపై తనిఖీలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 56 పనులకు చెల్లించిన మొత్తం రూ. 17లక్షల 31వేల విలువైన పనులను పరిశీలించారు. ఉపాధిహామీ కూలీల నుంచి అభ్యంతరాలు, వివరాలు తెలుసుకున్నారు. బృంద సభ్యులు డీఆర్‌పీ సీహెచ్.రాజు, సిబ్బంది, సర్పంచ్ సంతోష్ గౌడ్, కార్యదర్శి అనూష, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు



చింతలమానెపల్లి: మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్ రెడ్డి

కెరమెరి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఝరి గ్రామ పంచాయతీలో సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ ఏపీవో మల్లేశ్, సర్పంచ్ న్యానేశ్వర్ తదితరులు ఉన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఆర్ఐ జాఫర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో మహిళలు పాల్గొనాలి

దహెగాం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఐకేపీ కార్యాలయంలో స్వయం సహాయక సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దశాబ్ది ఉత్సవాల్లో మహిళా సంఘాల సభ్యులు పాల్గొనాలన్నారు. ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజల కష్టాలు తీర్చేది బీజేపీ'



రవీంద్రనగర్‌లో మాట్లాడుతున్న హరీశ్‌బాబు

చింతలమానెపల్లి: రాష్ట్ర ప్రజల కష్టాలను తీర్చేది భారతీయ జనతా పార్టీ మాత్రమే అని పార్టీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి గడపగడపకు బీజేపీ కార్యక్రమం మండలంలో చివరిరోజు బాలాజీఅనుకోడ, పాల్వాయినగర్, రవీంద్రనగర్‌లలో కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకుడు అజ్మీర ఆత్మారాం నాయక్‌తో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. రవీంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ విఫలమైందన్నారు. ఎమ్మెల్యే కోనప్ప మాయమాటలు చెబుతూ పబ్బం గడుపుతున్నాడన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొంగ సత్యనారాయణ, నాయకులు ఉమామహేష్, మల్లయ్య, రమేశ్, బొమ్మ రమేశ్‌గౌడ్, మురళి, శ్రీను, సంజీవ్, పరేష్‌రాయ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ భవనానికి స్థలం చూపించాలి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి గతంలో కేటాయించిన స్థలం చూపించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాజేశంకు శనివారం వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో రెండెకరాల స్థలం కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని, ఇప్పటి వరకు స్థలం చూపించలేదన్నారు. రేగుంట కేశవరావు మాదిగ, పస్తం అంజన్న, బన్ని మూర్తి ఉన్నారు.

30రోజుల కార్యాచరణ అమలు చేయాలి

ఆసిఫాబాద్: రాష్ట్రంలో పార్టీ బలోపేతం దిశగా చేపడుతున్న 30రోజుల కార్యాచరణ కార్యక్రమాలను అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కార్యకర్తలు బూతు స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు మురళీధర్, విజయ్‌కుమార్, లక్ష్మి, రమేశ్, సతీశ్‌బాబు, సుచిత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉపశమనానికి చెట్టే ఆధారం!



భానుడి ప్రతాపానికి మూగజీవాలు తల్లడిల్లిపోతున్నాయి. ఉదయమే మేతకోసం బయలుదేరిన పశువులు గంటసేపు కూడా మేయడం లేదు. ఏదో ఓ చెట్టును చూసుకుని నీడలో సేద తీరుతున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. కెరమెరి మండలం ధనోరా గ్రామ సమీపంలో ఓ పశువుల గుంపు చెట్టు కింద సేద తీరుతున్న దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

- కెరమెరి

క్రీడా ప్రాంగణంలో కంచె



చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్ర నగర్1లో గల తెలంగాణ క్రీడా మైదానంలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇసుకను భారీ మొత్తంలో డంప్ చేసి, రక్షణగా చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేశాడు. ఆటలు ఆడే స్థలంలో ఇసుక డంప్ చేయడమే కాకుండా కంచె ఏర్పాటు చేయడంతో స్థానిక క్రీడాకారులు మండిపడుతున్నారు. అధికారులు గమనించినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి విజయ్‌ను వివరణ కోరగా ఇసుక, కంచెను వెంటనే తొలగించాలని సదరు వ్యక్తిని ఆదేశించినట్లు తెలిపారు.

రైతులు మోసపోవద్దు

నార్నూర్: రైతులు పండించిన ప్రతిగింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎంపీపీ మోతుబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.